# అత్యవసర పరిస్థితి

ఎవరో బాగా పరిచయమున్న మొహం. వెంటనే గుర్తుపట్టలేకపోయేను. తర్వాత జ్ఞాపకమొచ్చింది. ఆయన శంకర్ మావగారు, రాఘవేంద్రరావుగారు, విజయవాడలో పేరున్న ఎడ్వొకేట్. రైల్లో ఎదురెదురు లోయర్ బెర్త్‌లేమావి. ఎ. సి. టూటైర్ కంపార్ట్‌మెంట్. పై బెర్త్‌లు రెండూ యింకా కాళీగానేవున్నాయి. నేను రాజమండ్రి వెడుతున్నాను. బహుశా ఆయన విజయవాడ కైవుంటుంది. ఆయన న్యూస్‌పేపర్ దించి నామొహంకేసి చూసినప్పుడు నమస్కారం పెట్టేను. యాంత్రికంగా ప్రతినమస్కారం చేసేడు. పెద్దవాడు, ఆయననన్నానవాలు పట్టే అవకాశంలేదు. నేను శంకర్ స్నేహితుణ్ణనీ, శంకర్‌కీ ఆయన కుమార్తె విద్యకీ పెళ్లయిన రోజున ఆయన్ని చూశాననీ పరిచయం చేసుకున్నాను.

"ఓహో!" అని మొహం చిట్లించుకుని, మళ్లీ ఇటూఅటూ చూసి గొంతుసవరించుకుని, "నువ్వూ మెడికల్ రిప్రజెంటేటివ్వేనా?" అన్నాడాయన. 'నువ్వూ' అన్నమాట పులి గాండ్రించినట్టుంది.

వాళ్ల పెళ్లయ్యి నాలుగేళ్లయింది. శంకర్ మెడికల్ రిప్రజెంటేటివ్. రాఘవేంద్రరావుగారి కూతురు విద్య గుంటూర్‌లో కాలేజి లెక్చరర్. ఆమెకి 'ఎక్యూట్ ఇన్‌ఫెక్టివ్ హెపటైటిస్' వొస్తే విజయవడలో ప్రయివేట్ నర్సింగ్‌హోంలో చేర్చేరు. అక్కడ డాక్టర్‌కి శంకర్ మంచి స్నేహితుడు. పక్కగదిలోనే శంకర్ బంధువుకూడా అదే పచ్చకామెర్ల వ్యాధితో వున్నాడు. నాలుగైదుసార్లు పక్కగదిలోకొచ్చి డాక్టర్ విద్యని పరిక్షచేసేటప్పుడు, ఆ వ్యాధికి సంబంధించిన వాళ్ల కంపెనీ తాలూకు శాంపిల్ మందులు శంకర్ డాక్టర్‌కివ్వడం, ఆ మందులు డాక్టర్ విద్యకివ్వడం జరిగిందిట. విద్య నెమ్మదిగా కోలుకుంటుండగా, తన బంధువుని చూడ్డానికొచ్చినప్పుడు శంకర్ పక్కగదిలో విద్య యోగక్షేమాలు కూడా కనుక్కునేవాడు. ఆమెని డిశ్చార్జ్ చేసే రోజన శంకర్ తన కంపెనీలో తాలూకు విటమిన్ కేప్సూల్సు, టానిక్ సీసాలు డాక్టర్ చేత విద్యకిప్పించేడు. తర్వాత ఆమె గుంటూరు వెళ్లిపోయింది. శంకర్‌కి ప్రొమోషనొచ్చింది. తరచు గుంటూరు కూడా టూర్ మీద వెళ్లినప్పుడల్లా ఆమెని సాయంత్రం వేళల్లో కల్సుకనీవాడుట. పర్యవసానం ఊహాతీతంకాదు. వాడి పెళ్లికి ఓ అరడజను మంది స్నేహితులం పోగయ్యేం. మా అందరికీ వాడి ప్రేమగాథ వివరించేడు.

"కాదండి. నేను హైదరాబాద్‌లోనే యల్ఐసిలో పనిచేస్తున్నాను. నేనూ శంకరూ వైజాగ్‌లో చదువుకున్నాం. పెళ్లి రోజున కలవడమే మళ్లీ ఈ నాలుగేళ్లలోనూ కలవలేదు." అన్నాను.

"మీరందరూ యువతరమయ్యా! అసలే వర్ణాంతర వివాహం. పైగా అతని తల్లితండ్రులకసలు యిష్టంలేదు, ఈ పెళ్లొద్దుమొర్రో అని మొత్తుకున్నాను. నా మాట ఎవరైనా వింటేనా! అందరూ నాకు నీతులు చెప్పినవాళ్లే, అక్కడికి నేను అనాగరీకుణ్ణయినట్టు మీరందరూ సంఘ సంస్కర్తలయినట్టూ!"

"ఏం జరిగిందండి?"

"ఏం జరిగితే నీకేం తెలుస్తుంది! మీ స్నేహాలన్నీ పాలపొంగులాంటివి. 'అవుటాఫ్‌సైట్- అవుటాఫ్‌మైండ్'. ప్రేమేతింటాం, ప్రేమేతాగుతాం, ప్రేమేపీలుస్తాం. ప్రేముంటే చాలు మాకింకే మీ అక్కర్లేదు, చావనేనా చస్తాం కాని మా ప్రేమజంట నెవరూ విడదీయలేరు అని వాళ్లిద్దరూ అంటుంటే అందరూవాళ్లకి తాళంవేసినవాళ్లే!" అన్నాడాయన కందగడ్డలా అయిన మొహంతో.

"అవును. శంకర్ చాలా బుద్ధిమంతుడు, తెలివైనవాడు, మంచి విశాలా భావాలున్నవాడు, స్వయం కృషితో పైకిరాగల సమర్థుడు. ఇద్దరూ మంచి సంపాదనలో వున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వాళ్లకి ఏ లోటూరాకుండా చూసుకోడానికి పెద్దవారు మీరున్నారు."

"పైపై మెరుగులు చూసి మోసపోయాం. అసలు ఈ మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం ఓ ఉద్యోగమేనటయ్యా! ఓ డాక్టరా! ఓ ఇంజనీరా! ఓ చార్టర్డ్‌ఎకౌంటెంటా! ఓ సైంటిస్టా! ఓ బేంక్ ఉద్యోగా!...."

"ఆ వుద్యోగానికేమొచ్చిందండీ! సమర్థతుంటే చకచక ఎంతపైకేనా వెళ్లొచ్చు. అసమర్థుడైనా, అదృష్టం బాగాలేకపోయినా, దుర్మార్గుడైనా ఏ వుద్యోగంలోనైనా చేరి చెడిపోవచ్చు."

"చెడిపోవడానికి పెట్టిన పేరీ వుద్యోగం. నడిమంత్రపు సిరిలాంటిది. మామేనల్లుడీ ఉద్యగమే వెలగబెడుతున్నాడు. వాడి తండ్రి కాలేజి లెక్చరరూ, ఏభయ్యేయిదేళ్లొచ్చినా స్కూటర్ మీదెడతాడు, నాతో బాటు మా అబ్బాయి ఎడ్వొకేటే. వీలుంటే నా కార్లో వస్తాడు, లేకపోతే స్కూటరే. మా పెద్దల్లుడు సివిలింజనీరు. మల్టీస్టోరీస్ బిల్డింగ్‌లు కట్టి లక్షలు సంపాదిస్తున్నాడు. మా పెద్దమ్మాయి పెళ్లిముందరే ఇద్దరమ్మాయిలకీ ఆ రోజుల్లోనే చవగ్గా

చెరో ఫ్లేటూకొన్నాను. మా పెద్దల్లుడు అతని సంపాదనతో ఈ వూళ్లోనే మరో రెండు ఫ్లేట్లుకొన్నాడు. ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా ఫ్లేట్లుకడుతున్నాడు. ఇప్పటికీ రైల్లో ఆర్డినరీ సెకెండ్‌క్లాస్‌లో వెడతాడు. మరి మామేనల్లుడూ వున్నాడు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా చేరి ఇరవయ్యేళ్లయింది. ఏదో పెద్ద ఉద్యోగమైందంటాడు. ఎప్పుడూ సూటూబూటూ టైతో ప్రత్యక్షం. ఊళ్లో తిరగాలంటే కారు బయట వూరంటే ప్లేనూ లేకపోతే ఫస్ట్‌క్లాసు ట్రెయినూ. ఎక్కడికెళ్లినా టేక్సీ. నెలకి యిరవై రోజులు తిరుగుతాడు...."

"అదంతా ఆవుద్యోగానికి స్టేటస్ సింబలే అనుకోండి, ఆ కంఫర్ట్స్ లేకపోతే అలా తిరగ్గలరా!"

"అలా తిరిగే పేకాట, తాగుడు, తిరుగుడు- ఒకటేమిటి సకలగుణాభి రాముడనిపించుకున్నాడు. ఒకసెంటు భూమికొన లేదు, గజం ఇంటి స్థలంలేదు, పెళ్లానికో చిన్న మెత్తు బంగారం కొనలేదు. ఏమిట్రా అంటే రిటైరయ్యేక ఏకంగా కంపెనీ పెద్దమూట కట్టి యిస్తుందిట. అదికాస్తా రిటైరయ్యేక యీ అలవాట్లకు సరిపోతుంది."

"మీ మేనల్లుడు దురభ్యాసాలతో పాడయ్యేడేమో తెలీదు. మెడికల్ రిప్రెజెంటేటివ్ ఉద్యోగంలో అంచీలు అంచీలుగా ప్రామోషన్లొచ్చి లక్షలు లక్షలు సంపాదించిన వాళ్ల నెంతోమందిని ఎరుగుదును. ప్రతిభకితగ్గ ప్రోత్సాహం వుంటుంది. అసలావుద్యోగం దొరికినిలబెట్టుకోవడమే అదృష్టం."

"అవునవును! అలాంటి వాణ్ణి ప్రేమించి పెళ్లాడ్డం మరీ అదృష్టం! ఆ అదృష్టం మా అమ్మాయినే వరించింది!"

"ఇంతకీ వాడు చేసిన మహాపరాధమేమిటి?"

"నెల్లాళ్లక్రితం విజయవాడలో మా అమ్మాయి పేరవున్న ఫ్లేట్ పదిలక్షలకి అమ్మేశాడు. ఆ డబ్బేంచేశాడో తెలీదు."

"మీ అమ్మాయి ఫ్లేట్ వీడెలా అమ్ముతాడు! మీ అమ్మాయి వెళ్లి ఆ కొనుకున్నవాడి పేర రిజిస్ట్రేషన్ చెయ్యాలికదా!"

"పవరాఫెటార్నీ తీసుకున్నాడయ్యా!"

"విద్యమీకు చెప్పలేదా?"

"దానికీ తెలియదుట. పైగాఅతన్ని ఆ విషయంలో ప్రశ్నించొద్దని మా యింటిల్లిపాదిమీద ఆంక్షలు విధించింది. గట్టిగా నిలదీసి అడగడానికి లేదు- ఇప్పుడు గర్భవతి. ఇదీ వాళ్ల ప్రేమబంధం కథ"

"నిజం నిలకడమీద తేలకుండా వుంటుందా! వారంరోజుల్లో పదిలక్షలెలా మాయం చేస్తాడండీ! ఇన్‌క్రెడిబుల్!"

"చాలా తెలివైనవాడు స్వయంకృషితో పైకొచ్చే సామర్థ్యం వున్నవాడు అని నువ్వన్నావుకదా! అమోఘమైన తెలివితేటలు అద్భుతమైన కృషి ప్రదర్శించేడు."

"మీరు ధైర్యంగావుండండి. ఇదేమైనా అయిదువేలా? పదివేలా! పదిలక్షలు. ఏం చేసేడో ఎన్నాళ్లు దాగుతుంది!" అన్నాను, ఆలోచనగా.

"పోయిన పదిలక్షలు గురించీ ఆలోచించటంలేదు. రేపొద్దున్నొచ్చి "అత్యవసర పరిస్థితొచ్చింది మరో పదిలక్షలు కావాలి" అంటే ఏం చెయ్యాలి? పరువేమవ్వాలి అని నా ఆందోళన. చూడు నాయినా! నా కిదివరలో హార్టెటాకొచ్చింది. నాకు బ్లడ్‌ప్రెషర్ రోగం. నన్నింక మాట్లాడించకు. నీ చేతిలో ఏదో పుస్తకం వుందిగా చదువుకో." అంటూ జేబులోంచి రెండు టేబ్లెట్లు నోట్లో వేసుకుని మంచినీళ్లు తాగి, నడుం వాల్చి అటుతిరిగి పడుకున్నాడు.

★ ★ ★

మళ్లీ అయిదేళ్ల తర్వాత ఓ స్నేహితుడి గృహప్రవేశం సందర్భంలో శంకర్, విద్య, వాళ్ల నాలుగేళ్ల బాబుని హైదరాబాద్‌లోనే కలిశాను. నా భార్య, యిద్దరి పిల్లల్నీ పరిచయం చేశాను. ఛీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ప్రొమోషనొచ్చింది. బంజారాహిల్స్‌లో చాలా పాష్ 'ఆనందసౌధ' కాంప్లెక్స్‌లో ఫ్లేట్ తీసుకున్నాడు. వాడిచ్చిన విజిటింగ్ కార్డ్‌లో ఈ వివరాలన్నీ వున్నాయి. మేము ప్లేట్లు అందుకుని భోజనానికుపక్రమించేముందు వాణ్ణి పక్కకి లాక్కెళ్లి మాట్లాడేను-

"నువ్వీవూరొచ్చి ఎన్నాళ్లయింది? ఓ ఫోన్‌లేదు, ఓ వుత్తరంలేదు!"

"మేమొచ్చి నెల్లాళ్లయింది. విద్యకి కూడా కొత్తగా ప్రారంభించిన ఓ కాలేజ్‌లో వుద్యోగం సంపాదించింది. మా కుర్రాడికి స్కూల్లో సీటు అన్వేషణ, అద్దెకున్నవాళ్లు ఫ్లేటు కాళీచేస్తే, కడిగించుకుని, రంగులేయించుకుని, సామాను సర్దుకోవడం, హెడ్ క్వార్టర్స్ వుద్యోగంలో కొత్త బాధ్యతలు- వీటితోనే యిన్నాళ్లూ సరిపోయింది. ఇంకిప్పుడు మిమ్మల్నందర్నీ చుట్టబెట్టాలనుకుంటున్నాను."

"మీ మావగారితో ఐదేళ్లక్రితం రైల్లో, యిక్కణ్ణుంచే కలిసి ప్రయాణం చేశాను. ఆయన విజయవాడలో దిగిపోతే నేను రాజమండ్రి వెళ్లేను" అన్నాను, ఆయన అభియోగంలో నిజమెంతో తెల్సుకుందామని.

"ఆయన ఎప్పుడూ హైదరాబాద్‌రాలేదే.... ఓయస్ అవును. అయిదేళ్లక్రితం...."

"అంతకి నెల్లాళ్ల క్రితం నువ్వు విజయవాడలో విద్య పేర వున్న యిల్లు అమ్మేసి పదిలక్షలు మాయంచేశావుట..."

"అవునవును. ఆ సందర్భంలోనే మాతోడల్లుణ్ణి వెంటబెట్టుకుని ఓ రహస్యమైన పనిమీదొచ్చేడు."

"రహస్యమైన పనా?"

"నేనాడబ్బేంచేశానో, నా కున్న వ్యసనాలేమిటో, నేనేదయినా క్రిమినల్ కేస్‌లో యిరుక్కుని బ్లేక్‌మేయిల్‌కి లోబడ్డానేమో దర్యాప్తు చెయ్యడానికి ఓ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజెన్సీతో సంప్రదించడానికొచ్చేడాయన."

"సంప్రదించేరా?"

"ఎప్పటికప్పుడు కనుక్కున్న వివరాలు మాతోడల్లుడికి రహస్యంగా చెప్పమని వాళ్లకి చెప్పేడు. వాళ్లు పదివేలు ఎడ్వాన్సిమ్మన్నారు. మా తోడల్లుడు మర్నాడు పట్టుకొచ్చియిస్తానని చెప్పి మా మామగార్ని రైలెక్కించేడు. ఆ ప్రయాణంలోనే నువ్వు కల్సుకునుంటావు."

"మరి ఆ డిటెక్టివ్ ఏజన్సీ దర్యాప్తు చెయ్యలేదా?"

"ఎడ్వాన్సివ్వలేదు. మళ్లీ వాళ్లని కలవలేదు. ఆ విషయం మాతోడల్లుడే నాతో చెప్పాడు."

"అంటే డబ్బేంచేశావో మీ తోడల్లుడికి తెలుసా?"

"ఊఁ"

"అంత డబ్బేంచేసేవురా! పాపం మీ మావగారు అంతక్రితం ఓసారి హార్టెటాకొచ్చిందట. ఈ సంగతి నాకు చెబుతూండగానే ఆయన బి. పి. పెరిగిపోయింది."

"బ్రదర్! భార్యగర్భవతిగా వుండి పుట్టింట్లో వున్నప్పుడు పరస్త్రీ సాంగత్యం నిషేధం కాదని మను ధర్మశాస్త్రంలో వుంది. పురుషుడి కష్టసుఖాలు తెలుసుకున్న మహానుభావుడా మనువు." అన్నాడు నవ్వుతూ.

"ఎంత పరస్త్రీ సాంగత్యమైనా ఇల్లమ్మేసి పదిలక్షలు.. బ్లడీఫూల్! ఇదా నీ అత్యవసర పరిస్థితి!" నిలదీసి అడిగేను.

"ఏం జరిగిందో చెబుతాను. రహస్యంగా వుంచుతావా?"

"ఉంచుతానుకాని, నిన్ను క్షమించను." అన్నాను. నేను వీణ్ణి ఎంతపొగిడేను! వీడుచేసిన నిర్వాకమేమిటి! ఆలోచిస్తూ.

"అంతకి నెల్లాళ్లక్రితం కాన్ఫరెన్సుంటే ఇక్కడకొచ్చి మాతోడల్లుడి 'ఆనంద్ సౌధ్' బిల్డింగ్ కాంప్లెక్స్ ఎంతవరకూ వొచ్చిందో చూద్దామని ఓ సాయింత్రం బంజారాహిల్స్‌కి వెళ్లేను. పునాదులు లేచేయి, అప్పుడే ఫ్లేట్లు బుక్ చేసుకుని ఎడ్వాన్సిస్తున్నారుట. తను హైదరాబాద్‌లో వున్నప్పుడు ఇక్కడ సూపర్‌వైజ్ చెయ్యడానికి కొక అసిస్టెంట్ ఇంజినీర్‌ని నియమించుకున్నాడుట. ముప్ఫయ్యేళ్లుంటాయి. స్మార్ట్‌గా వున్నాడు. అతన్నీ అతని చెల్లెల్నీ పరిచయం చేశాడు. ఆ అమ్మాయి చాలా అందంగా వుంది, భర్త ఏడాదిక్రితం పోయాట్ట. వాళ్లతో బాటు ఆ రాత్రి నన్ను కూడా డిన్నర్‌కి పిలిచేడు. ఆ అమ్మాయి ఫ్రీగాచాలా సరదాగా మాట్లాడుతుంది...."

"ఎంత అందంగావున్నా, ఎంత సరదాగా మాట్లాడినా.."

"వినరా. నేను యిల్లు అమ్మీముందర, నన్ను అర్జెంటుగా రమ్మని మాతోడల్లుడి దగ్గర్నుంచి ఫోనొచ్చింది. వెళ్లేను. అప్పటికేఆ శుభవార్త అందరూ చెప్పుకుంటుంటే నా చెవినపడింది. మా తోడల్లుణ్ణి వల్లో వేసుకుని ఆ అమ్మాయి వారంరోజులు తిప్పింది. ఈలోగా ఆ అన్నగారంటున్నవాడు, ఫ్లేట్లు బుక్ చెయ్యాగావొచ్చిన బాపతు పదిహేనులక్షలు పైగా బ్లాక్‌మనీ వున్న సూట్‌కేస్ చేతబుచ్చుకున్నాడు. అతను మైకంలోంచి బయట పడేటప్పటికి ఆ సూట్‌కేస్‌తో సహా ఆ అమ్మాయిని వెంట బెట్టుకుని ఆ అసిస్టెంటింజినీరు పదిహేనులక్షలున్న నా సూట్‌కేస్ పట్టుకు పారిపోయేడు. పని ఆగిపోయీ పరిస్థితొచ్చింది. పదిలక్షలు నాక్కావాలి. నాకు విజయవాడలో వున్న మూడు ఫ్లేట్లూ మా ఆవిడపేరవున్నాయి. ఇప్పుడు విద్యకి ఏడో నెలయితే, మా ఆవిడకి తొమ్మిది నిండేయి. రేపోమాపో కాన్పొస్తుందని ఎదురు చూస్తున్న ఈ సమయంలో దానికేం చెప్పినా చిందులుతొక్కుతుంది. మనమావగారికి మరో హార్టెటాకొస్తుంది. నువ్వెలాగయినా విద్యనొప్పించి, విషయం రహస్యంగావుంచి, మీ ఫ్లేట్ అమ్మేసి డబ్బట్టుకొస్తే నేను యీ వూర్లో కడుతున్న దాంట్లో మంచి ఫ్లేటిస్తాను. ఎలాగైనా నువ్వీసహాయం అర్జెంటుగా చెయ్యాలి" అన్నాడు. మాతోడల్లుడు నా చేతులు పట్టుకుని. మరి నేను చక్రం అడ్డెయ్యక తప్పలేదు." అన్నాడు, నవ్వుతూ వాడి సహజ ధోరణిలో.

"మొత్తం మీద మనుధర్మశాస్త్రం మీతోడల్లుడికి బుద్ధి చెప్పినా నీకు లాభించిందన్నమాట." అన్నాను, వాడి భుజం చరుస్తూ.

* *ఆంధ్రభూమి, 1999*